క థా ని క:

# రేడియో పోటీ

శ్రీ గొల్లపూడి లక్ష్మీనారాయణ

నాగలి వీరయ్య, చాలు సూరయ్యలలో ఒక్కయింటిపేరు, పేర్లల్లోనే కాదు; పోలికల్లోను, గుణాల్లోను ఎంతో సామ్యముంది. నలుపు అనటానికి వీల్లేని ఎఱుపు చాయ, పొట్టికాని పొడుగు, పంపరపనస కాయ అంత పొట్ట, కొసలు ఎంత మెలి వేసినా నిమ్మకాయలు నిలపెట్టలేని బుఱ్ఱ మీసాలు - ఇల్లాంటి పోలికల్లో, వాళ్లిద్దరిలో ఫలానా అని గుర్తించటానికి వీల్లేదు. ఇంకా వాళ్ళ జీవితానుభవాల్లో చాలా పోలిక లున్నై. ఇద్దరూ నలభయ్యోపడిలోపడి, ఏ బాదరబందీ లేకుండా సుఖంగా కాలం వెళ్లదోస్తున్నారు. ఇద్దరికీ భార్యలు చనిపోయి పుష్కరం కావస్తోంది. వీరయ్య కొడుకు తాలూకాఫీసులో గుమాస్తాగా చేరి, సంవత్సరం తిరిగేసరికల్లా, తాసీల్దారు కుర్చీలో కూర్చున్నాడు సూరయ్యకొడుకు పొగాకువ్యాపారంలో బస్తీలో భవనమొకటి కట్టించాడు తమకున్న దాదాపు వందయకరాల భూమిని, వీరయ్య సూరయ్యలు జీతగాళ్ళను పెట్టి సాగు చేయించుకుంటున్నారు. వాళ్లిద్దరి యిళ్లూ ఒక్కవీధిలోనే, కొద్దిమారంలో ఎదురెదురుగా వున్నై.



ఇద్దరికే ఇంతగా అవినాభావసంబంధం వున్నప్పటికీ - అసలు ఇన్నిగుణాగుణాలు ఇద్దరికీ సమానంగా వుండబట్టేనేమో; జన్మ విరోధ మనుకునేటంతగా వాళ్లు పోటీలు పెంచుకున్నారు.

వీరయ్య మట్టిఅరుగులు తీసివేసి, బండ అరుగులు కట్టించితే; సూరయ్య సిమెంటుతో నున్నగా అరుగులు కట్టించి, ఏనుగు తొండాలు పెట్టించాడు. వీరయ్య పెంకుటిల్లు ముందుభాగం వూడదీసి, డాబావేసి, పైన రెండుగది కట్టిస్తే; సూరయ్య 'అబ్బే, రెండుగదులు నా తాతలనాటి ఫ్యాషను కాదటయ్యా!' అని వూళ్ళో ప్రముఖులతో వ్యాఖ్యానించి త్రిభుజాకారంగా మేడ మీద గది ఒకటి కట్టించాడు (అసలు సూరయ్యయింటిసలమే త్రిభుజాకారంగా వుంది, పాపం!) పందేలకని - సూరయ్య పుంజులని పెంచితే, వీరయ్య కోడెదూడలను పెంచుతుంటాడు.

ఊళ్ళో రిపబ్లిక్ వుత్సవాలకని హంగామా చేస్తున్నారు, వూరి పెద్దలు. మూడువందల గడపదాకా వుందా వూళ్లో. చుట్టుపక్కల పది వూళ్లకీ తలమానికంగా వుందని పోలీసు స్టేష నొకటిపెట్టారు. పెద్ద ఆసాములే పది మందికిపైగా వున్నారు. వాళ్లల్లో సూరయ్య వీరయ్యలు చెప్పుకోదగ్గవారే.

ఉత్సవం హుందాగా జరిపే ప్రయ

తాన్నాళ్లలో పెద్దల సమావేశ మొకటి జరిగింది. సూరయ్య వీరయ్యలు విడివిడిగా సమావేశానికి హాజరయ్యారు. ఇల్లాంటి సమావేశాల్లో తల యిరికిస్తే, నెత్తిన కొంత బాధ్యత పడుతుందనీ, జేబుల్లోంచి కొంత డబ్బు జారుతుందనీ తెలియకపోదు. అయితే సంసారపు చిక్కులేమీ లేక, ఏ యేడు కాయేడు మూలిగే డబ్బుకు మరికొంత డబ్బు జేర్తుంటే, ఏం జేయాలో ఆలోచించటానికి కొంతకాలం ఉక్కిరి బిక్కిరిఅవుతుండే టటువంటివాళ్లు; వూళ్లో కొంత పలుకుబడి, అందుమూలంగా నాయకులయ్యే అవకాశాలు కళ్లకెదురుగా కనిపిస్తూంటే, ఒక్క డబ్బుమాటనే కావలించుకుకూర్చునేటంత మూర్ఖులు కారు వాళ్లు. అదీగాక, వాళ్లిద్దరిలో ఎవళ్లకు వాళ్లు, తను ఒకవేళ్ల ఇల్లాంటివాటిలో జోక్యం పుచ్చుకోకపోయినా, రెండోవాడు కల్పించుకుని తనకన్నా ఎక్కువగా పలుకుబడి సంపాదిస్తే, చేతులు కాలాక ఆకులు పట్టుకోవాల్సి వస్తుందని ముందుగానే జాగ్రత్తపడేవారు

ఉత్సవం వైభవంగా జరిగేందుకు రేడియో ఒకటి కావల్సివచ్చింది. 'ఆ రోజుకుగాను ఎవరైనా తమ రేడియో సెట్‌ను ఇస్తారా?' అని ఒక ప్రముఖసభ్యుడు హెచ్చరించాడు. కొంతమంది ఇవ్వటానికిఅంగీకారం చూపుతూ చేతులెత్తారు. కాని మొట్టమొదటగా నోరు తెరచి మాట్లాడింది వీరయ్యే!

'యుద్ధం పూర్వంరోజుల్లోనే, అంటే చూశారూ, ఆ మంచి రోజుల్లోనే కొన్న రేడియో మా యింట్లో వుంది. అది అప్పట్నుంచీ ఏమాత్రం రిపేరు అంటూ లేకుండా పనిచేస్తున్నది! చూశారూ, —ఆ కాలం వేరు, ఆ వస్తువులు వేరు. చాలా పెద్దగా వినిపిస్తుంది. ఈ వూరివారు చాలామంది వినే వుంటారు.' అని తన రేడియోను సభ్యులకు ఎరుక చేశాడు

సూరయ్య రెండుఆకులు ఎక్కువే కాని, తక్కువ చదువలేదు. 'నేను కొత్తగా మొన్నీమధ్యే రేడియో ఒకటి కొన్నాను. అయితే, మీలో ఎవ్వరున్నూ వినివుండక పోవచ్చు దాని దేముంది! - ఎంచేలంటే, చెవులు కోసిన నక్కలాగు దానిచేత రాత్రింబవళ్లు అరపించి, దానినోరు చెడగొట్టి, మీ చెవులు దిబ్బళ్లువేయించటం, నాకు బొత్తిగా యిష్టంలేదు సుమాండి! కాని, గమనించారూ, రిపబ్లిక్‌వుత్సవాలకని చెప్పకుండా ప్రత్యేకంగా అల్లాంటి ఎప్పుడూ వుపయోగించని రేడియోనే వుపయోగించటం సబబు. ప్లాస్టిక్‌కేస్‌మీద ఆపిల్‌పండు, నీలిమందురంగులు - చూడటానికి కూడా చాలా ముచ్చటగా వుంటుందిలెండి!' అని తన రేడియోను సూరయ్య సభ్యులకు పరిచయం చేశాడు.

రేడియోవిషయం మొదట హెచ్చరించిన పెద్దమనిషికి గుండెమీది బరువు కాస్తా తగ్గిపోయింది - సూరయ్య వీరయ్యలు పోటీయుద్ధం వుపక్రమించేసరికి. కాని కొత్త బెడద ఒకటి వచ్చిపడింది, ఈ పోటీయుద్ధం సద్దేలా అని. మిగతా సభ్యులంతా ఈ పోటీ ఎలా పరిణమిస్తుందో నని కౌతుకంతో ముభావంగా గమనిస్తున్నారు.

వీరయ్య మళ్లా చెప్పాడు. 'నా రేడియోను నేనే మెచ్చుకోవటం కొంతమందికిలాగా నాకు చేతకానూ కాదు, అసలు కిట్టనూ కిట్టదు. నా రేడియోను రిపబ్లిక్‌వుత్సవానికి వుపయోగించినందువల్ల నా రేడియో ధన్యమూ అవుతుంది, వూరిప్రజలూ-ఇన్నాళ్ళూ వీనులవిందుగా విని సంతోషించినట్లే, ఆరోజూ విని సంతోషిస్తారు. ఇంతకుమించి నేను చెప్పేదేముంది, చెప్పండి?' అని కందగడ్డలా అయిన ముఖంతో మూతి ముడుచుకు కూర్చున్నాడు.

సూరయ్య అందుకున్నాడు 'నేను మళ్లా, మళ్లా చెప్పేదేమీ లేదు. నా రేడియోకు వీరియల్' అంటూ వేరే హంగామా ఏదీ చేయనక్కర్లేదు. చూడటానికా ముద్దొస్తూంటుంది. చక్కగానూ వినపడ్తుంది. అయినా గమనించారూ, మాటసందర్భం వచ్చింది కాబట్టి బాగుండదని నా రేడియో అంటూ వున్నదని, ఇవ్వటానికి అభ్యంతరమేమీ లేదని చెప్పా కాని; ఇదేమీ ప్రాధేయపడవలసిన విషయం కాదు. పెద్దలంతా మీరే నిశ్చయించండి! మంచిచెడ్డలు మీకు తెలియకపోతాయా?' అని చేతులు వణుకుతూంటే, అరచేతుల్లోకి పట్టినచెమట వుత్తరీయానికి తుడుస్తూ ముగించాడు

ఆకుల గలగలలా కాసేపటవరకూ గుసగుసలు సాగినై. ఏమి చెప్తే ఏమి మునుగుతుందో నని ఆందోళనచెందుతున్నారు. అంతలో మొదట రేడియోవిషయం హెచ్చరించినాయనే, 'దానిదేముందిలెండి, మీరిద్దరూ యివ్వండి! మీ వుత్సాహం మే మెలా కాదంటాం? ఎటువంటి ఎధవ శబ్దం లేకుండా ఏది చక్కగా వినిపిస్తుందో, దాన్నే వాడుకుందాం. ఏమంటారు?' అని దోషిని నిర్దోషిగా భావించుతున్నట్లు నటించి తీర్పు చెప్పే న్యాయాధిపతిలా, చెప్పాడు.

సరే, మిగతా విషయాలన్నీ చర్చించుకున్నాక సమావేశం ముగిసింది.

పొగాకు కాడ కొనటానికని, వీరయ్య దోవలో బీడీదుకాణందగ్గిర ఆగాడు. నిజానికి ఇంట్లో కావల్సినంత పొగాకు వున్నా, సూరయ్యతోపాటు కలిసి నడవాల్సిన అవసరం తప్పించుకునేందుకుగాను, ఈ ఖర్చుకి అంగీకరించాడు.

ఇంటికెళ్లినవెంటనే, వీరయ్య, స్నానం తిండీ, సంగతి అట్లా వుంచి, తన పాతరేడియోని తీసి ఇస్త్రీతువ్వాలుతో ఒకటేపనిగ తుడిచాడు.

• ఆ మర్నాటి సాయంకాలం సూరయ్య తన అరుగుమీద కాసేపు కూర్చుని కాలక్షేపం చేసి, సంజచీకటి పడటంతో ఇంట్లోకి పోతూ, ఒకపాదం గడపఅవతల పెట్టి, అలవాటుప్రకారం వీరయ్యయింటివంక దృష్టి సారించాడు. ఆ వీధిలోనే అటునుంచి మలుపు తిరిగాక రెండోయిల్లే వీరయ్యది. మట్టూ ఎత్తులేని ప్రహరిగోడ, వాకిట అరు

(33-వ పేజీ చూడుడు)


# గర్భ నిరోధిని

శరీరారోగ్యమునకు భంగంలేకుండ కొంత కాలమువరకు గర్భం రాకుండ ఆపుటకు ఔషధం రు 10 లు. చాలాకాలంవరకు రాకుండ చేయుటకు రు 25 లు. వి. పి. చార్జి రు 1-0-0

# పుంస్త్వవర్ధని తైలం

నరములు బలహీనత చెంది సంతోషసౌఖ్యములకు దూరమై దుఃఖించువారల పాలిట వరప్రసాదిని మా నపుంసక తైలం. 1 సీసా రు. 10 లు వి పి చార్జి రు 1-0-0 మరియు నేపాళదేశపు కస్తూరి, అంబర్ హేమం కలసి ప్రత్యేకంగా తయారుచేయబడి జగత్ప్రఖ్యాతి వహించిన తైలము గలదు. సీసా 1 కి రు 25 లు వి పి చార్జి రు 1 ఆర్డర్లిచ్చువారు ముందుగా పైకం పంపుమా జవాబుకు కవరు పంపేది

డాక్టర్ రత్నం సన్సు,

షలకపేట బిల్డింగ్స్, హైద్రాబాద్, దక్కన్

# రేడియో పోటీ
(10-పేజీ తరువాయి)

గులు, కోటసింహద్వారంలాంటి గుమ్మం. అప్పుడే మలుపుతిరిగి ఈ వీధిలో ప్రవేశించిన యిద్దరు యువకులు సూరయ్య కంటిలో పడ్డారు. 'ఎవరబ్బా! ఎప్పుడూ చూసిన మొహాలుకావే; ఎవ రింటికో?' అని ఆశ్చర్యపోయి అలా ఆగిపోయాడు. ఆ యిద్దరూ సరిగ్గా వీరయ్యయింటిదగ్గరే ఆగి, తెరచివున్న సింహద్వారానికెదురుగా నిల్చున్నారు. సూరయ్యగుండెలో గుండ్రాయి పడ్డది. 'ఏదో వుందిరా రహస్య'మనుకుని రహస్యపరిశోధకుని పని పుచ్చుకోవాలని రకొమని తలుపేసి మేడగదిలోకి వళ్లి, కిటికీలోంచి చాటుగా చూడటం మొదలు పెట్టాడు

ఆ మసకచీకటిలోనే సూరయ్య ఆ యిద్దరి వేషం సరిగా పరిశీలించాడు ఇద్దరూ చొక్కాలు లోపలికి వేశారు. కాళ్లకు బూట్లు మాసిన జేబురుమాళ్లు తలకు కట్టారు అల్లాగే మాసినవేషం వారెవరో అంతగా పసికట్టలేదు సూరయ్య వాళ్లల్లో ఒకడు లోపలికివెళ్ళాడు. మరు నిమిషానికి రెండోవాడూ వెళ్లాడు మొదట వెళ్లినవాడు తనకి కనిపించటంలేదు రెండోవాడు వరండాలోకి వెళ్లక, ఒక్క క్షణమాగి, యింటిచుట్టూ అటూయిటూ తిరిగి, ఇంజనీరులా పరిశీలించాడు బహుశా వీరయ్య ఎవ్వరికీ తెలియకుండా వున్నట్లుండి మూడో అంతస్తు వేస్తే, వూళ్లోవాళ్లంతా నోరు తెరచుకుని ఆశ్చర్యపోతా రనుకున్నాడు కాబోలు పాపం. లేకపోతే అంత దొంగచా టెందుకు? కాసేపటికి నిశ్చలంగా ఆ రెండోఅతనే గుమ్మానికెదురుగా, ఏదో అవతలమనిషి చెప్తూంటే తలూపినట్లుగా, కొద్దిగా తలను కదిలిస్తున్నాడు ఇంకేం, వీరయ్యే తన ఆలోచనల్ని తెలియచేస్తున్నాడు అంతలోకి, రెండవఅతనుచేతుల్లోకి పాత రేడియో సెట్ ఒకటి వచ్చింది అది వీరయ్యది! మరుక్షణానికి మొదట అతనూ వచ్చాడు. ఇద్దరూ గుమ్మందాటి, ఒకసారి వెనక్కి తిరిగి, చిరునవ్వు నవ్వి, సెల్యూట్ చేసి తన యింటిమీదుగానే వస్తున్నారు. అమ్మయ్య! అసలు కథ కొస్తా ఇప్పటికి బయటికి పడిపోయింది. తనలాంటి పరిశోధకుడికి బయట పడక ఎంతసేపు దాక్కుంటుంది?—వీరయ్యది పురాతనపు రేడియోసెట్. ఏదో తన మీదకు మాటమీదమాట పోటీకి వచ్చాడే గాని ఆయనికిమాత్రం తెలియదూ, తనది పాతరేడియో అని? ఇంకేం, మాట నిల్పుకోవటానికని, వసుదేవుడంతటివాడు గాడిదకాళ్లు పట్టంగా అర్ధ రాత్రప్పుడు రిపేరర్లను పిలిపించితే తప్పేముంది? అదీ సంగతి! అని చిన్నగా విని పించీ వినపించనట్లు నవ్వుకున్నాడు సూరయ్య. అయినా సంగతేమిటో తేల్చుకుందామని తలుపుతీసి వాళ్ల కెదురుగా వెళ్లాడు.

చీకటిలోంచి హఠాత్తుగా వెలువడ్డ సూరయ్యను చూసేసరికి రేడియో కొస్తా దభీమని కింద పడ్తుందేమో నన్నంతగా నిశ్చేష్టు లయ్యారు.

కొంప మునిగినంత హడావుడిగా సూరయ్యే పల్కరించాడు. 'వీరయ్య పాత రేడియోకదండి, మీరు తీసుకెళ్లేది? ఏమన్నా చెడిపోయిందా ఏమిటి?' అని తన సంతోషాన్ని బలవంతాన దాచి టకటకా అడిగాడు.

రేడియో పట్టుకొనని మొదటాయన ఈ తుఫానునుంచి తేరుకుంటూ బదులు చెప్పాడు 'పాతదేఅనుకోండి! అయినా, అంతగా చెడిపోలేదు ఏదో కొద్దిపని. ఏ మాత్రం లోపం లేకుండా బాగా పని చేస్తుందో లేదో చూడమన్నారు వీరయ్య గారు.'

అదీ సంగతి! ఎంత దూరాలోచన, ఎంత ముందుచూపు! ఏమీ లోపంలేకుండా పాతరేడియో అద్భుతంగా వుండాలని వీరయ్యఆశ! తనది క్రొత్తదేఅనుకో, అయినా, కొని సంవత్సరమైనా ఇంతవరకూ మళ్లా దాని మోహంచూసిన పాపాన పోలేదు. అప్పుడప్పుడు పాతతడిక విరగ్గొట్టినట్లు శబ్దం వస్తుందనుకో. అయినా, వీరయ్య వుత్సవంరోజున పోటీకనే పంపిస్తాడని నమ్మకమేది? 'అయితే మళ్లా ఎప్పుడు తెస్తారు?' లాయరు క్రాస్ఎక్జామినేషనులో ఆఖరుప్రశ్న వేశాడు సూరయ్య

'ఇరవై ఐదులోపలే తెమ్మన్నారు ఇరవైఆరుతేదీన అర్జంటుపని వుందట' ఇంకేం తేలిపోయింది. వుత్సవంరోజు పోటీకే తనది క్రొత్తరేడియోఅయినా, ఈ రిపేరుచేసిన రేడియోముందు, పాతదేఅయినా తీసిపోవచ్చు ఎవరు చూశారు? అంతగా అతి ఆత్మవిశ్వాసం కూడదంటారు. అని నిశ్చయానికి వచ్చి సణుగుడుగా తన కోర్కెను బయటపెట్టాడు

'నాది క్రొత్తరేడియో అనుకోండి. అయినా పరీక్షించి ఏమన్నా చేయాల్సి వుంటే చేసిపంపిస్తారా. బహుశా మీ కిప్పుడు తీరదనుకుంటాను మీకు అభ్యంతరం లేకపోతే ఇప్పుడే పట్టుకెళ్లచ్చు' అని ఆదుర్దాగా సమాధానంకోసం ఎదురుచూస్తూ హెచ్చరించాడు.

ఆయువకు లిద్దరూ ఒకరి మొహాల్లోకి ఒకరు చూసుకున్నారు. మొదటాయనే మాట్లాడాడు.

'అలా అంటే ఏమి చెప్తాము అండి! మీ రన్నట్లు మా కిప్పుడు చేతికిమించిన పని తగులుతున్నది అయినా మీవంటిపెద్దల మాట తోసెయ్యలేము. ఏమంటావోయ్!' తన సహచరుణ్ణి హెచ్చరించాడు

సూరయ్య ఆత్రుతగా ఆ సహచరుడివంక చూశాడు.

'కష్టమో, గిష్టమో తీసుకెళ్దాంపదండి! పెద్దవారిమాట ఎలాకాదంటాం?' అన్నాడా రెండోఅతను.

ఇంట్లోంచి తన క్రొత్తరేడియో తీసుకొచ్చి మొదటి యువకుడి చేతులో పెట్టాడు. వాళ్లు నమస్కరించి వెళ్లిపోయారు.

'ఇప్పుడు చూసుకో నా తడాఖా! ఇహ పెంటకుప్పలో పారేయవలసిందే ఆ వీరయ్య పాతరేడియో! ఇలా అనుకొనని విజయాన్ని తను సాధించటం తలపోస్తూంటే పది నిమిషాలు గడిచినై 'అరరే! ఎంతపని జరిగింది! వాళ్లు ఒకవేళ సమయానికి తీసుకురాకపోతే, నేనన్నా వెళ్లి తెచ్చుకుందునుగదా,—వాళ్ల కంపెనీ ఎడ్రసు అడగకపోతినే!' అని నొచ్చుకున్నాడు కాసేపు. కాని సూరయ్య బుద్ధిగల బుఱ్ఱకు వెంటనే దానికి విరుగుడు ఆలోచన తట్టింది 'ఆఁ నే నడక్కపోతేమాత్రం, వీరయ్య ఎడ్రసుతీసుకోకుండా యిస్తాడా?' అని అనుకుని 'వాళ్లు ఇరవై ఐదుకల్లా తీసుకురాకపోతే వీరయ్య నడిగితేసరి' అని తనను తాను సమాధానపరచుకున్నాడు; లోపల కొంత పేరులాటగా వున్నది వీరయ్య నుంచి గాల్సి వస్తుందని.

ఒకగంట గడిచిందో లేదో, వీరయ్య, ఆయన యింట్లోంచి బయటకు వచ్చి చకచకా నడుస్తున్నాడు. 'ఎక్కడికో?' అని సూరయ్య తనలో ప్రశ్నించుకుంటుంటే, వీరయ్య తన యింటిదగ్గరకే వచ్చి, తొందరగా తన తలుపు బాదటం మొదలుపెట్టాడు. వెదుకబోయిన తీగే కాళ్లకు తగిలిందట!

వేటకాడిచేతిలోకి, వాడు గురి చూడదలచిన పిట్టే ఆశ్చర్యంగా ఆకాశంలోంచి పడ్డట్టు, వీరయ్యే తనదగ్గిరకి వచ్చాడు.

'కాసేపు అట్లాగే వాకిటదగ్గిర నిలబెట్టుదా' మనిపించి, తలగుడ్డ షోగ్గా చుట్టి, బుజ్జమీసం పైకి ఎగదోసి, చుట్ట వెలిగించి పట్టణంలో కొన్న చేతికఱ్ఱ పుచ్చుకుని, చాలా అర్జంటుపనికై బయలుదేరుతున్నట్టుగా క్రిందికి దిగివచ్చి తలుపు తీశాడు. కాని, ఎవరున్నారు? వీరయ్య కాస్తా మాయమయ్యాడు. పాపం సూరయ్యకు ముద్దుపెట్టుకుంటానని చెప్పి మూతి కొరికినట్లయ్యింది. గుప్పిటలో వున్నది 'తాయం, తాయం' అని చిన్నపిల్లాడికి మిఠాయి ఆశ చూపి, గుప్పిట తెరచి గులకరాయి చూపినట్లయ్యింది.

ఏమిపనిమీద వచ్చాడో, తనతో ఏమవసర మొచ్చి ఏమడగదలచి వచ్చాడో అనే ఆతుర్దా నరాల తీపులా ఆయనలో బయలుదేరింది' ఇట్లాంటి అవసర మొచ్చినప్పుడు తను అడిగించుకోకపోతే, మళ్లా అవకాశ మొస్తుందో రాదో అన్న దిగులూ పుట్టింది. అంచేత 'వేయనే వేళాను వేషం' అని అల్లాగే బయలుదేరి వీరయ్య యింటిముందుగా చిన్నగా నడక సాగించాడు. వీరయ్య యింటిలో ఎక్కడా జీవ మున్నట్టు అనిపించలేదు. ఇప్పుడేగదా వీరయ్య తన తలుపు కొట్టిందికాబట్టి ఇంకా రోడ్లవెంటే తిరుగుతూవుంటాడని, తను కనిపిస్తే, పల్కరించి అవసరమేదో అడుగుతాడని; సూరయ్య రోడ్లవెంట తిరగటం ప్రారంభించాడు. కాని సూరయ్యకు కోపం ముంచుకు వస్తుందన్న భయమైనా లేకుండా, వీరయ్య కనిపించనే లేదు. ఈ చీకటిలో ఏ ప నీ లే కుం డా తి రి గి తే పెద్దమనిషిలక్షణం కాదని, ఎవరైనా అడిగితే ఏంపనిమీద తాను వెళ్తున్నానని చెపుదామా అని ఆలోచించాడు. ఆయనచురుకైన మెదడుకు క్షణంలోనే, తనకు గౌరవం గొప్పతనం కలిగించే ఆలోచ నొకటి తట్టింది లైబ్రరీకి వెళ్తున్నట్లూ చాలాకాలం నుంచీ ఒక చేతినుంచీ మరొక చేతికి అనవరతం మారుతూ, ఎంతనే గ్రంథాలయానికి పునరాగమనం చేయని విశ్వనాథవారి "వేయిపడగలు" వచ్చిందేమోనని కనుక్కొని తెచ్చేందుకు వెళ్తున్నట్టు పని కల్పించింది ఆయనబుఱ్ఱ.

లైబ్రరీకి వెళ్లే దోవలోనే వుంది పోలీసు స్టేషను. పోలీసుస్టేషనుముందు ఆరాత్రివేళ సముద్రఘోషపెడ్తూ అంతగా జనం మూగటం సూరయ్యను కలవరపెట్టింది. దానికిమించిన కలవరం కలగజేసింది ఆగుంపులోనే వీరయ్యదర్శనం. ఆ కంపనలో కూడా సూరయ్యకు నవ్వు వచ్చింది, పాపం, వీరయ్యకు, తనే ఆయనకోసం తిరుగుతున్నట్లు తెలియదు. పైగా, పిచ్చమనిషి తనకోసం అక్కడా యిక్కడా తిరిగి తిరిగి, ఇక్కడేమైనా తను వుంటానేమోనని, ఇక్కడికి తయారయ్యేడు. కాని, ఇప్పుడే వుంది నాటకాంతం. కథ క్లైమేక్సెక్కేది యిప్పుడే. అంచేత తను వీరయ్యను చూడనట్లు నటిస్తే; తనకి పల్కరించే బాధ్యత తప్పిపోగా, ఆయనంతట ఆయన పల్కరిస్తాడు. ఆయన అవసరమేదో అడిగించుకొని తను, మాటల సందర్భంలో రిపేరర్ల ఎడ్రసూ కనుక్కోవచ్చు. ఇలా ఆలోచించి ఆ గుంపు ఎంచేత కూడిందో కనుక్కొనటానికి వచ్చినట్లుగా శ్రద్ధపుచ్చుకున్నాడు సూరయ్య.

పోలీ సొకడు ఒకరైతుని అడుగుతున్నాడు. 'అయితే రోడ్డుమీద కారుఆపటం, అందులోంచి ఇద్దరు దిగటం నీవు చూశావన్నమాటేగా?'

సబ్ ఇన్స్పెక్టరు అంటున్నాడు. ఇంకా ఏమిటి సందేహం? అవి తీసుకెళ్లి దాంట్లో, పెట్టి చల్లగా జారిపోయారు. ఇప్పటికి యాభై మైళ్లన్నా వెళ్లివుంటారు.' అని పెదవి విరచాడు.


'అయితే, లాభంలేదంటారా?' అని అడిగాడు వీరయ్య విచారంగా.

తను వీరయ్యప్రశ్న వినిపించుకోనట్లు నటించినప్పటికీ, సూరయ్యకు లోపలలోపల సంతోషమే కలిగింది, తన ప్రత్యర్థి వస్తువు ఏదో పోయినందుకు. సంతోషంతోపాటు, కారణం తెలియకుండానే ముళ్లకంప గుచ్చుకుంది సూరయ్య గుండెకు.

ఇహ నిలదొక్కుకోలేక 'ఏమిటండీ! అసలువిశేషం?' అని అడిగాడు మారిపోయిన బొంగురుగొంతుకతో, సూరయ్య.

'హుఁ! సరే, ఇంతకీ మీరు వినలేదన్నమాట! భలేబాగుంది! పైగా ఎదురెదురు యిళ్లు! సరిసరి. వీరయ్యగారింట్లోనండీ, దొంగలు జొరబడి ఆయన రేడియో కాస్తా పట్టుకెళ్లారు!'

[*Francis Harrison* రచించిన *Neighbours*' కథను దృష్టిలోనుంచుకుని.]



హాండ్లేపేజ్ కంపెనీ తాలూకు "మరాథన్" అనే విమానం. దీని సిబ్బందిలో మూడు బ్రిటిష్ అధీనదేశాలకు చెందిన వ్యక్తులు పనిచేస్తున్నారు. ఒకరు దక్షిణాఫ్రికావారూ, కెనడావారూ, మరొకరు ఆస్ట్రేలియావారు; మిగతాయిద్దరూ ఇంగ్లీషువారు. వ్యాపార ప్రచారంనిమిత్తం ఈ విమానం ప్రపంచాన్ని చుట్టి రావడానికి బయలుదేరుతున్నది.